# కమలం.. కాంగ్రెస్ చెట్టాపట్టాల్

- కాంగ్రెస్‌కు అనుకూలంగా బీజేపీ ఎన్నికల వ్యూహం
- బలమైన అభ్యర్థులకు కాకుండా జనబలం లేని నాయకులకు టికెట్లు
- లోపాయికారిగా సహకరించుకుంటున్న రెండు పార్టీల నాయకులు

సంగారెడ్డి, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో కమల దళం కాంగ్రెస్‌తో కలిసిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీ ఎన్నికల వ్యూహం కాంగ్రెస్‌కు సానుకూలంగా ఉండటమే ఇందుకు కారణం. రాజకీయ విశ్లేషకులు సైతం బీజేపీ కాంగ్రెస్‌కు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్నదని భావిస్తున్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ బలంగా ఉంది. ప్రజలు బీఆర్‌ఎస్ వెన్నంటే ఉన్నారు. ఇది ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు మింగుడుపడటం లేదు. రాజకీయంగా బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే సత్తాలేని కాంగ్రెస్, బీజేపీలు కలిసికట్టుగా పని చేయాలని లోపాయికారి ఒప్పందానికి వచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఎన్నికల వ్యూహం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉందన్న ప్రచారం సాగుతోంది. సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అయితే బీజేపీ చివరి వరకు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను పూర్తిగా ప్రకటించలేదు. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించింది. బలమైన అభ్యర్థులను బరిలో దింపాల్సిన బీజేపీ ప్రజాబలం లేని నాయకులకు టికెట్లు ఇచ్చిందని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు.

**బలమైన అభ్యర్థులను పక్కనబెట్టి..!**

సంగారెడ్డి జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాల్లో బలహీనమైన అభ్యర్థులను బీజేపీ బరిలోకి దింపింది. బీజేపీ టికెట్ల కేటాయింపులోనూ పార్టీ అధిష్టానం రాజకీయ విలువలను తోసి రాజి కుట్రపూరితంగా వ్యవహరించింది. ఇందుకు సంగారెడ్డి టికెట్ కేటాయింపు ఉదాహరణగా చెప్పవచ్చు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఎంతోకాలంగా బీజేపీ నేత రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పార్టీ కోసం పనిచేస్తున్నారు. టికెట్ తనకు దక్కుతుందని నమ్మకంతో ఉన్నారు. బీజేపీ అధిష్టానం సైతం ఆయనకు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. రాత్రికి రాత్రి మనసు మార్చుకొని ఇటీవల బీజేపీలో చేరిన పులిమామిడి రాజుకు బీఫామ్ ఇచ్చింది. పులిమామిడి రాజు కంటే దేశ్‌పాండే సంగారెడ్డి నియోజకవర్గంలో బలమైన అభ్యర్థి అని బీజేపీ నాయకులు చెబుతున్నారు. దేశ్‌పాండే నాలుగేళ్లుగా నియోజకవర్గం అంతా తిరుగుతూ సొంత కేడర్‌ను తయారు చేసుకున్నారు. అలాంటి నేతను పక్కనబెట్టి ఇటీవల పార్టీలో చేరిన రాజుకు టికెట్ ఇవ్వటం విడ్డూరంగా ఉందని బీజేపీ నేతలు ఆశ్చర్యపోతున్నారు. పులిమామిడి రాజు గతంలో కాంగ్రెస్‌లో పనిచేశారు. ఆయనకు జగ్గారెడ్డికి సత్సంబంధాలు ఉన్నాయి. పులిమామిడి రాజు పోటీచేస్తే బీఆర్‌ఎస్ ఓట్లు చీల్చుతారని, అది తమకు అనుకూలిస్తుందని కాంగ్రెస్ నేతలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఉంటారనే బీజేపీ అధిష్టానం దేశ్‌పాండే స్థానంలో రాజుకు టికెట్ ఇచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

▶ జహీరాబాద్ నియోజకవర్గంలో సైతం స్థానిక నేతలను పక్కనబెట్టి స్థానికేతరుడైన దామోదర్ రామచందర్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. దామోదర్ రామచందర్‌ను పారాచూట్ లీడర్‌గా బీజేపీ నాయకులు చెబుతున్నారు. రాంచందర్‌కు జహీరాబాద్ నియోజకవర్గంతో ఎలాంటి సంబంధం లేదు. హైదరాబాద్‌కు చెందిన ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర్‌కు సోదరుడు. ఇటీవలే బీజేపీలో చేరిన ఆయనకు అధిష్టానం జహీరాబాద్ టికెట్ ఇచ్చింది. స్థానికంగా బలమైన నేతలు ఉన్నా ప్రజలు గుర్తుపట్టని రాంచందర్‌కు బీజేపీ టికెట్ ఇవ్వటాన్ని సొంత పార్టీ నేతలే తప్పుబడుతున్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు రాంచందర్‌కు అనుకూలంగా పనిచేసే అవకాశాలు కనిపించడం లేదు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో పార్టీలో చాలా కాలంగా పనిచేస్తున్న, సొంత కేడర్ ఉన్న విజయపాల్‌రెడ్డిని పక్కనబెట్టి మరోనేత సంగప్పకు బీజేపీ టికెట్ ఇచ్చింది. బలంగా ఉన్న విజయ్‌పాల్‌రెడ్డికి కాకుండా స్థానికంగా పట్టులేని సంగప్పకు టికెట్ కేటాయించటాన్ని సొంత పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. సంగప్పకు సహకరిస్తానని విజయపాల్‌రెడ్డి చెబుతున్నప్పటికీ ఆయన మనస్ఫూర్తిగా పనిచేయరన్న ప్రచారం సాగుతుంది.

▶ అందోలు నియోజకవర్గంలో సైతం బీజేపీ తీసుకున్న నిర్ణయం అందరినీ ఆశ్చర్యపర్చింది. అందోలు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన బాబూమోహన్ బీజేపీ అదిష్టానం తనను పట్టించుకోవటంలేదని, ఎన్నికలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. దీంతో స్థానికుడైన మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్యకు బీజేపీ టికెట్ ఖాయం అని అందరూ భావించారు. అయితే బీజేపీ అనూహ్యంగా పోటీచేయనని ప్రకటించిన బాబూమోహన్‌కు టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్, బీజేపీ అభ్యర్థి బాబూమోహన్‌కు మధ్య లోపాయికారి ఒప్పందం జరిగినట్లు నియోజవకర్గంలో ప్రచారం సాగుతున్నది. పటాన్‌చెరు నియోజకవర్గంలో నందీశ్వర్ గౌడ్‌కు టికెట్ ఇవ్వటాన్ని సొంత పార్టీ నేతలు శ్రీకాంత్ గౌడ్, అంజిరెడ్డి తదితరులు తప్పుబడుతున్నారు. నందీశ్వర్‌కు సహకరించమని బీజేపీ నేతలు చెబుతున్నారు.

# ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు

- వ్యక్తి గత విమర్శలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం
- స్థాయికి మించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం తప్పదు
- బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, తదితరులు

జహీరాబాద్, నవంబర్ 11: కాంగ్రెస్ నాయకులు ఓటమి భయంతోనే బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, స్థానికేతరును తరమికొట్టేందుకు జహీరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్‌ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమారు అన్నారు. శనివారం సాయంత్రం జహీరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు స్థాయికి మించి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉండి మంత్రి ద్వారా పనులు చేసుకొని ఇప్పుడు పార్టీ మారి తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ఓటమి బయంతోనే బీఆర్‌ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడం, సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్నారని వారికి గుణపాఠం తప్పదన్నారు. బీఎస్పీ అభ్యర్థి సైతం బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, స్థానికేతరులు ఎన్నికల సమయంలో జహీరాబాద్‌కు వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో కాంగ్రెస్, బీఎస్పీ అభ్యర్థులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీదు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి మోహన్, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ మొహినొద్దీన్, మొహిజొద్దీన్, రాములునేత, మోతీరాం, కుత్బొద్దీన్ ఉన్నారు.

# ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

న్యాల్‌కల్, నవంబర్ 11: ఎన్నికలు సమీపిస్తుండడంతో మరింత అప్రమత్తంగా ఉండి పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని పోలీసు ఎన్నికల నిఘా విభాగం అదనపు డీజీపీ దయాల్ గంగ్వార్ అన్నారు. శనివారం మండలంలోని తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని హుస్సెల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద వాహనాల రాకపోకల నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం తదితర రికార్డులను పరిశీలించారు. ఆనంతరం ఆయన మాట్లాతుడూ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24 గంటల ప్రత్యేక నిఘా ఉంచి, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఆయా రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రాకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశా రు. ఆయనవెంట జహీరాబాద్ డీఎస్పీ రఘు, తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు ఉన్నారు.

# బీజేపీ అధిష్టానానికి 'గడీల' అల్టిమేటం



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్

- నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్
- రెండు రోజుల్లో స్పందించకుంటే కార్యచరణ ప్రకటిస్తాం
- నందీశ్వర్‌గౌడ్ బీజేపీ కార్యకర్తలను దుర్భషలాడుతున్నారని ఆరోపణ

పటాన్‌చెరు, నవంబర్ 11: బీజేపీ అధిష్టానంపై ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్ అల్టిమేటం జారీ చేశారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలోని శ్రీకాంత్‌గౌడ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు పార్టీ నాయకులు పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీ టికెట్‌ను ఆశించి తీవ్ర ప్రయత్నాలు చేసిన శ్రీకాంత్ గౌడ్‌ను కాదని పటాన్‌చెరు బీజేపీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌కు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సమావేశంలో శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిగా నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఏ ప్రాతిపాదికన ఇచ్చారని ఆయన ఆ పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించారు. నందీశ్వర్‌గౌడ్‌కు టికెట్ ఎందుకు ఇచ్చారో రెండు రోజుల్లో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనిపక్షంలో తాను కార్యాచరణ ప్రకటిస్తానని అల్టిమేటం జారీ చేశారు. బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన నందీశ్వర్‌గౌడ్ పార్టీ మండల అధ్యక్షులతో, నాయకులతో ఇష్టారీతన మాట్లాడుతున్నారని, దుర్భాషలాడిన వీడియోలు ఆధారాలతో సహా పార్టీ అదిష్టానం నాయకులకు పంపినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నందీశ్వర్‌గౌడ్ ఎవరిని కలుపుకొనిపోకుండా తమను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. పటాన్‌చెరు బీజేపీ అభ్యర్థిని ప్రకటించే సమయంలో నియోజకవర్గంలోని బీజేపీ నేతలను సంప్రదించకుండా అదిష్టానం నిర్ణయం తీసుకోవడం తమను కలచివేసిందన్నారు. పార్టీ కోసం 24గంటలు పనిచేసే కార్యకర్తలు, నాయకులు ఉన్నారని వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడం ఎంత వరకు సబబు అని నిలదీశారు. పార్టీ కోసం పస్తులుండి పనిచేసే కార్యకర్తలున్నారని, ఆత్మగౌరవం చంపుకుని నందీశ్వర్‌గౌడ్‌కు పనిచేసే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ భారతీ నగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నె శ్రీకాంత్, తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కోటే శంకర్, పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిన్నారం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ ఏర్పాట్లను వేగవంతం చేయాలి

- నామినేషన్ల స్క్రూట్నీ జాగ్రతగా చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్



భానూర్‌పాఠశాలలో సౌకర్యాలు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

పటాన్‌చెరు, నవంబర్ 11: పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశించారు. శనివారం పటాన్‌చెరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బందితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తూ తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. నామినేషన్ స్క్రూటినీని జాగ్రతగా చేయాలని సూచించారు. పోలింగ్ రోజు చేయాల్సిన ఏర్పాట్లు, ఓటర్ స్లిప్పుల పంపిణీ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్ జారీ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఓటర్ స్లిప్పులను రేపటినుంచి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ లిస్టులను డౌన్‌లోడ్ చేసుకొని ప్రింటింగ్‌కు ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం వారీగా ఓటర్ లిస్టులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఏకకాలంలో దరఖాస్తులను స్వీకరించి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలికవసతులు ఉండేలా చూడాలన్నారు. అనంతరం భానూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంపు, వీల్‌చైర్ సౌకర్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారి దేవుజా, సహాయ రిటర్నింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

**దీవాళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి**

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: ఇంటికి, సమాజానికి, జగతికి వెలుగులు పంచే దీపోత్సవమైన దీపావళి పండుగ అందరికీ జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ ఆకాంక్షించారు. శనివారం ప్రకటనలో జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దీపావళి జరుపుకోవడం మన సంప్రదాయమన్నారు. ఈ నెల 30న ప్రతి ఒక్కరూ ఓటు వేసి తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకోవడం మరచిపోవద్దని కోరారు.